# కలహంస హింస

- భమిడిపాటి సోమయాజి

"వచ్చారా! ఇప్పటివరకూ ఆదిలక్ష్మిగారు మీ గురించి కూర్చుని వెళ్ళారు."

"ఏం! ఎందుకు!" అన్నాడు ఆమె భర్త "కలహంస".

"అదేమిటండీ! మరచిపోయారా!" మీరు అచ్చువేయించిన "కథల సంపుటి" వాళ్ళ దేవుడి గదిలోపెట్టి, పూజ చేస్తానన్నారని చెప్పాను కదా!

"సర్లే శుభం! మిగిలిన అయిదు వేలు యిచ్చేసి పుస్తకాలు తీసుకువెళ్ళమన్నాడు ఆ ప్రెస్ ఓనర్".

"అయితే సరే! మంచిరోజు చూసుకుని పూజ చేయిద్దాం ఆవిడ చేత." అంది, ఆదిలక్ష్మి.

"ఇవన్నీ అవసరమంటావా"

"బాగుంది వరస! ఆవిడ పూజచేసి ఆ దేవుడి గదిలో ఓరోజు నిద్ర చేయిస్తే, మన పుస్తకాలు వేడి వేడి ఉల్లి పకోడీలా అమ్ముడుపోతాయ్! మొన్నటికి మొన్న భానుమతి పెళ్ళి శుభలేఖ వాళ్ళ పూజా మందిరంలో ఓరోజు నిద్రలో ఉంచింది! బోల్డు మంది, అది కూడా అసలు పెళ్ళికి రారనుకున్నవాళ్ళు కూడా వచ్చి బహుమతులు చదివించారు. అసలు ఎంగిలి చేత్తో కాకిని కొట్టని వాళ్ళు కూడా భారీగా చదివించి పోయారట!

ఇంతలో ఆదిలక్ష్మిగారు మళ్ళీ వచ్చారు! ఈరోజు శుక్రవారం! లక్ష్మీదేవిలాంటి నువ్ యీ రోజు రెండు సార్లు రావడం మా అదృష్టం వదినా!

"అది సరే! అన్నయ్య పుస్తకాలు తెస్తే, తీసుకువెళ్ళి రేపు శనివారం కదా పూజలో పెడదామని వచ్చాను."

అసలు విషయం తెలుసుకుని, పది రూపాయల వడ్డీకి ఓ అయిదువేలు ఎవరిదగ్గరో తీసుకువచ్చి, సర్దుతానంది ఆదిలక్ష్మి.

మొత్తంమీద అచ్చయిన పుస్తకాలు యింటికి రావడం, ఆదిలక్ష్మిగారి దేవుని గదిలోకి, ఓ పదకొండు పుస్తకాలు వెళ్ళడం జరిగిపోయింది.

ఓ రాత్రి, ఆదిలక్ష్మిగారింట్లో ఆ పుస్తకాలు "నైట్ హాల్ట్" చేసాయ్. ఆ మర్నాడు ఆ పుస్తకాలు తీసుకుందామని "కలహంస" కలం పేరుగల కామేశ్, ఆదిలక్ష్మిగారింటికి వెళ్ళాడు.

"తొందర పడకండి! పదకొండు పుస్తకాలు పూజలో పెట్టాంకదా! పదకొండు రాత్రుళ్ళు అవి మా యింట్లోనే పడుకుంటే మంచిది" అని అతన్ని సాగనంపుతూంటే!

"పూజ చేయించిన పుస్తకాలు ప్రథమంగా అమ్మితే మంచిదేమోనని" వచ్చానన్నాడు, కలహంస.

"అలా చాదస్తంగా ఉండకండి! మిగిలిన పుస్తకాలు విక్రయించడం మొదలెట్టండి. వడ్డీ మాత్రం నెలనెలా కట్టెయ్యండి!" అంది, ఆదిలక్ష్మి.

* * *

ఆ మర్నాడు, కొన్ని పుస్తకాలు తీసుకుని బయల్దేరాడు కలహంస.

ఆదిలక్ష్మిగారి అమ్మాయి, ధనలక్ష్మి యింటికి వెళ్ళాడు, ధనలక్ష్మి చాలా ఆప్యాయతగా కాఫీ యిచ్చింది. ఏమిటి విశేషాలు" అంది.

"ఏం లేదు నేను



కథలు రాస్తానని తెలుసుకదా! ఓ "కథా సంపుటి" వేయించాను. వేయించడమంటే, కథలు, "వేపుడు" కింద తయారుచేసాననుకుంటుందేమోనని, ఓ పుస్తకం సంచిలోంచి తీసి చూపించాడు. ప్రథమంగా ఓ పుస్తకం నీకు అమ్మడానికి వచ్చానంటే బాగుండదేమోనని, నీకు యిద్దామని వచ్చాను" అన్నాడు.

"నేనంటే మీకు చాలా యిష్టం అంకుల్! చిన్నప్పుడు నన్ను ఎత్తుకుని ఆడించేవారని అమ్మ చాలా సార్లు చెప్పింది. ఈ పుస్తకం, నాకు నిన్ననే అమ్మ పంపించింది"అని తన దగ్గర వున్న పుస్తకం చూపించింది, ధనలక్ష్మి.

ఆ పుస్తకం చూసిన కలహంస పూజలోని పుస్తకం బయటికి వచ్చేసిందన్న నిజం తట్టుకోలేక, ధన్‌మని తన చేతిలోని కాఫీ కప్పు క్రింద పడేశాడు. పుస్తకం అమ్ముడుపోకపోతే పోయింది, ఈ పగిలిన కాఫీ కప్పుకి డబ్బు అడగకుండా వుంటే చాలని, మనస్సులోనే దేవుడికి దండం పెట్టుకున్నాడు. గండం గడిచింది! ధనలక్ష్మి భర్త ఆఫీస్‌కి వెళుతూ, మీ కథలు నిన్న రాత్రి మొత్తం చదివేశాను, చాలా బాగున్నాయ్! అన్నట్లు "ధనూ" ఆ పుస్తకం మా ఆఫీస్‌లో వాళ్ళకిస్తాను! ఇంత మంచి రచయిత మన ఫ్యామిలీ ఫ్రెండ్ అని తెలిస్తే, ఆఫీస్‌లోనే పడిపోతారు వెధవలు!" అన్నాడు.

"నేను చదివిన తర్వాత యిద్దామండీ!"

"మీ అమ్మ దగ్గర యింకా పుస్తకాలున్నాయ్" అన్నావుకదా! ఇంకో నాలుగు పంపించమను!

"సరే నే వస్తా!" అంటూ కలహంస బయటికి వచ్చేశాడు. అతని మనస్సు వికలమైపోయింది. "పదకొండు పుస్తకాలు, పదకొండు రోజులు నిద్ర చేస్తే మంచిది"అని చెప్పిన ఆదిలక్ష్మి, పుస్తకాలు దేవుడి దగ్గర్నుంచి తీసేసి, అందరికీ పంపిస్తోందన్న మాట! గట్టిగా అడుగుతే, ఆ అప్పు అయిదువేలు తీర్చెయ్యమంటుందేమోనన్న భయం కలిగింది, కలహంసకి! ఈ విషయాలు తెలుసుకున్న కలహంస కాంతం, కలత చెందింది.

* * *

కొన్ని రోజులు గడిచాయ్! కొన్ని పుస్తకాలు కష్టపడి అమ్మేశాడు, కలహంస. కొన్ని పుస్తకాలు అమ్మకం నిమిత్తం షాపుల్లో యిచ్చాడు. ఓ రెండు నెలల తర్వాత వెళ్ళి, ఆ షాపుల వాళ్ళని కలిస్తే, "పుస్తకాలు పోవటం లేదన్నారు". కొన్ని పుస్తకాలు "ఆదిలక్ష్మీ స్వీకారం"వలన పోయిన విషయం జ్ఞాపకం వచ్చిన కలహంస, "కొన్ని పుస్తకాలు పూర్తిగా పోతున్నాయ్! కొన్ని అసలు పోవడం లేదు!" అనుకుని, ఓ వెర్రి నవ్వు నవ్వుకున్నాడు.

ఓసారి, ఓ ఫ్రెండ్ దగ్గరకి వెళ్ళి, కొన్ని పుస్తకాలైనా అమ్మిపెట్టమని అడిగాడు.

"ఈ రోజుల్లో పుస్తకాలు ఎవరూ కొనడం లేదురా! నేనైతే ఓ పుస్తకం తీసుకుంటా"నని, భార్యని పిలిచి, "బీరువాలోంచి ఓ వంద రూపాయలు పట్టుకొచ్చి, తన ఫ్రెండ్‌కి, యిమ్మన్నాడు."

లోపల్నుంచి వచ్చిన అతని భార్య "పుస్తకాలు కొని చదవడం మాకు అచ్చిరాలేదనీ, ఓసారి వాళ్ళ పెదమామగారు, కొత్త పుస్తకం కొని చదువుతూంటే, చెప్పరాని గుండెపోటు వచ్చి గుటుక్కుమన్నాడనీ, తన అత్తగారు చనిపోతూ, ఈ విషయాలన్నీ చెప్పి, ఎప్పుడూ పుస్తకాలు కొని చదవద్దని, చేతిలో చెయి వేయించుకుని మరీ చనిపోయిందనీ" చెప్పింది.

ఈ పుస్తకం కొని, తన ఫ్రెండ్ గుండెపోటుతో చనిపోతే హత్యానేరం తన మీదకి వస్తుందేమోనని భయపడిన కలహంస, "సారీ అమ్మా! అత్తగారికిచ్చిన మాట

నిలబెట్టుకోతల్లీ! ఈ పుస్తకం ఊరికే తీసుకోవడానికి అభ్యంతరం లేదు కదా!" అని తన ఫ్రెండ్ భార్యని అడిగాడు.

"ఊరికే అయితే ఎన్ని పుస్తకాలైనా తీసుకోండి"అని కూడా చెప్పారండి, మా అత్తగారు."

అబ్బో! ఊరికే అయితే ఎన్ని పుస్తకాలైనా తీసుకోమని చెప్పిందా! ఇదేదో పెద్ద విపత్తులా వుందని, కాఫీ యిస్తానన్నా తాగకుండా ఓ పుస్తకం బహుమతిగా యిచ్చేసి తుర్రుమన్నాడు కలహంస.

ఇంటికెళ్ళి ఈ విషయాలు తన శ్రీమతితో చెప్పాడు కలహంస.

"ఉంటారండీ! కొంతమంది సాధ్వీమణులు! తు.చ. తప్పకుండా అత్తగారి మాట పాటిస్తారు! వాళ్ళవల్లే ఈ బోటులేని ఆకాశం కింద పడకుండా నిలబడి వుంది!" అంది అతని శ్రీమతి.

"అది సరే కాని, కొత్త పుస్తకం కొంటేనే గుండెపోటు వచ్చి చచ్చిపోతారంటావా!"

"అసలు ఎప్పుడూ అప్పనంగా వచ్చిన పుస్తకాలు చదవడానికి అలవాటుపడిపోయి, మరచిపోయి, హఠాత్తుగా ఓ పుస్తకం కొని చదవడం వలన కానీ ఆ పుస్తకంలోని విషయాలు బాగా లేకపోవడంవలన కాని, మరి యిక సగం ధరకైనా ఆ పుస్తకం అమ్మలేవని తెలుసుకుని పడే బాధవలన కాని గుండెపోటు వచ్చి బాల్చీ తన్నెయ్యొచ్చు! అయినా, చావు గురించి బాగా తెలిసిన వారిని ఎవర్నైనా అడిగి తెలుసుకుని చెపుతాను. ఈ విషయం రహస్యంగా ఉంచండి. పుస్తకాలు సగం రేటుకి కూడా అమ్మలేనివారు గుండెపోటు వచ్చి పోతారని ఆదిలక్ష్మికి తెలుస్తే, తన అప్పు వెంటనే తీర్చెయమని ముందే చంపేస్తుంది" అంది శ్రీమతి కలహంస.

❊ ❊ ❊

ఓ పది రోజుల తర్వాత, కొన్ని పుస్తకాలు తీసుకుని బయల్దేరాడు, ఎలాగైనా ఆ పుస్తకాలన్నీ ఆరోజు అమ్మెయ్యాలని.

పార్వతీదేవికి మంగళ హారతి యిచ్చేటప్పుడు మహిళలు పాడే "కలహంస నడకల కలికి ఎక్కడికే"అన్న పాట అందుకుంది, శ్రీమతి కలహంస.

బయల్దేరుతూంటే "ఎక్కడికి"అని అడగడం అపశకునం అని కాసేపు కూర్చుని మళ్ళీ బయల్దేరాడు.

దాంలోనున్న తన ఫ్రెండ్ యింటికి వెళ్ళి, తను రాసిన పుస్తకమొకటి తీసుకోమన్నాడు.

మంచి సమయానికి వచ్చావ్! "అప్పలకొండ"అని మా మేనల్లుడొకడు ఈరోజు పొద్దున్నే వచ్చాడు. అబ్బో! వాడు పుస్తకాలు తెగ చదువుతాడు!"అంటూ, ఒరేయ్ అప్పలకొండా! ఓసారి యిటురా! అని పిలిచాడు, కలహంస మిత్రుడు.

ఈ "అప్పలకొండ" అను చదువరి ఒక్క పుస్తకమైనా కొనకపోతాడా అని కొండంత ధైర్యంతో ఉన్నాడు కలహంస.

ఇంతలో ఆ అప్పలకొండ అను నామధేయుడు, ఓ పుస్తకం చదువుతూ, చదువుతూ వచ్చి, అడ్డంగానున్న ఓ సోఫాని ధన్‌మని గుద్దేసి, పడి పైకి లేచేశాడు.

**అయినా, పుస్తకాలు కొని చదవడం నాకిష్టం వుండదు! శుభ్రంగా ఓ కేజీ స్వీట్లు, ఓ కేజీ పకోడీలు కొనుక్కుంటే, యింటిల్లిపాదీ తినొచ్చు**

"ఆ పుస్తకం ఎక్కడ పడిందో చూసుకోరా, కొండా!"అంటూ మా మేనల్లుడికి చదువుతున్న సమయంలో, తన్మయత్వం ఆవహించి ఒళ్ళు తెలీదు, పాపం! దెబ్బలు తగిలినా, చదువు మాత్రం ఆపడు.

"ఆ! పోతే పోనీ! నేను వచ్చేటప్పుడు, రైల్లో ఎవరో మరచిపోయిన పుస్తకం! నేనేదో కొనిన పుస్తకమన్నట్లు బాధపడతావేమిటి, మావయ్యా!"

"ఈయన మా ఫ్రెండ్‌రా!" కలహంస కలం పేరుతో కథలు రాస్తూంటారు! ఈమధ్యనే, ఓ కథా సంపుటి అచ్చువేయించారు అని మేనమావ చెపుతూంటే,

"ఓ చాలా సంతోషమండీ, మిమ్మల్ని కలవడం! మీ కథలంటే నాకు చాలా యిష్టం"అంటూ కరచాలనం చేశాడు, అప్పలకొండ.

"ఓ పుస్తకం పోవడం ఖాయం" అనుకుంటూ, సంచీలోంచి ఓ పుస్తకం తీసి, కొండకి అందించాడు, కలహంస.

"ఓ, యిదా! ఏదో అనుకున్నాను, ఈ పుస్తకం మొన్న వైజాగ్ నుంచి నర్సీపట్నం వెళ్ళేటప్పుడు రైల్లో చదివేశాను."

"అబ్బ! అంత తక్కువ సమయంలో ఎలా చదివేశావురా, అనుకోకుండా చేతిలో పడిన పుస్తకాలు తొందర, తొందరగా చదవడంలో నువ్వు బంగారు కొండవిరా, కొండా!" అన్నాడు, మేనమామ.

"ఏం చేస్తాం మావయ్యా వ్యవధి లేదు, ఆ పుస్తకం ఓనర్ వైజాగ్ నుంచి నర్సీపట్నం దాకానే ప్రయాణిస్తున్నాడు".

"అదీ! అలా చెప్పు!"

"అయినా, పుస్తకాలు కొని చదవడం నాకిష్టం వుండదు! శుభ్రంగా ఓ కేజీ స్వీట్లు, ఓ కేజీ పకోడీలు కొనుక్కుంటే, యింటిల్లిపాదీ తినొచ్చు" అన్నాడు, కొండ.

కలహంస యిదంతా విని బాధపడతాడేమోనని, "అబ్బ! నీ పుస్తకాలు హైదరాబాద్‌నుంచి వైజాగ్ దాకా వెళ్ళాయన్నమాట!" అన్నాడు, కలహంస మిత్రుడు.

"టైమ్ అటువంటిది, పుస్తకాలు ఎక్కడ నుంచి ఎక్కడకైనా పోతాయ్! కొన్ని, అసలు ఎక్కడకీ పోవులే, నేవస్తా!" అంటూ, కదిలిపోయాడు, కలహంస.

❊ ❊ ❊

ఈ విషయాలు తన శ్రీమతి తెలుసుకుని, ఎవరైనా రైల్లో నుంచుని కాకుండా, ఒంగుని చదివే వారుంటే, వాళ్ల వీపుమీద తెల్లకాయితాలు పెట్టి కథలు రాసుకుంటే, యింట్లో కరెంటు ఖర్చు కలిసొస్తుంది! ఆ పని చెయ్యండి!" అంది, కలహంస శ్రీమతి.

ఆదిలక్ష్మిగారు యిప్పించిన అప్పు, అసలూ వడ్డీ కలిపి, తడిసిమోపెడై, పుస్తకాలు కన్నీళ్ళతో తడిసిపోయే స్థితికి వచ్చి, "దీపం వుండగానే యిల్లు చక్కబెట్టుకోవాలి, పొడిగా వుండగానే పుస్తకాల పని పట్టాలి" అని, ఆ బాకీ నిమిత్తం సగం పుస్తకాలు, ఆదిలక్ష్మిగారికి జమ కట్టేశారు, కలహంస దంపతులు.

ఆదిలక్ష్మిగారు మాత్రం తెలివిగా బాకీని మించి ఆ పుస్తకాల్ని సొమ్ముచేసుకున్నారు. లక్ష్మి, లక్ష్మీ సంతతినే వరిస్తుంది!

★


**రచయిత చిరునామా:**

బి.డి.ఎస్.శర్మ,
ప్లాట్ నెం.5, శాలివాహన నగర్,
శ్రీనగర్‌కాలనీ పోస్ట్, హైదరాబాద్-73.





